క్లుప్తంగా

బూరుగులమ్మకు ఊంజల్ సేవ



రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసం చివరి ఆదివారం గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. కార్తిక మాసంలో ఆదివారం అమావాస్య తిథి అరుదుగా రావటంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

200 మందికి గుండె వైద్య పరీక్షలు



రేపల్లె రూరల్: ఎస్ఎస్ ఫౌండేషన్, రసాలయ కళాసమితి, మోహమ్మద్ ఇమాముద్దీన్‌ఖాదరీల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎస్ అకాడమీలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు హారూన్ రషీద్ 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరానికి హాజరైన వారికి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రసాలయ కళాసమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోడె గౌరీశంకర్, అధ్యక్షుడు మల్లెల రామచంద్రరావు, ఎస్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ కె.దాసు, మేకా రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



బాపట్ల: మండలంలోని వెదుళ్ళపల్లిలో యజ్ఞ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్డియాలజిస్ట్ డాక్టరు యజ్ఞ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మందికి పైగా వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్డియాలజీ నిపుణులు, రేడియాలజీ, స్త్రీల వైద్య నిపుణులు, ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు, షుగర్ వ్యాధి నిపుణులు పాల్గొని రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యజ్ఞ శ్రీకాంత్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని మారుమూల గ్రామాలలో సైతం తమ యజ్ఞ హాస్పటల్ ఆధ్వర్యంలో గడిచిన సంవత్సర కాలం నుంచి ఇప్పటివరకు 14 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని, 'సేవే లక్ష్యం సేవే మార్గం' నినాదంతో భవిష్యత్తులో ప్రతి గ్రామానికి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని బాపట్ల జిల్లాలో ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

జనవరి 5న హైందవ శంఖారావం

రేపల్లె రూరల్: హైందవ ధర్మ పరిరక్షణకై జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు నరేంద్రవర్మ తెలిపారు. పట్టణంలోని రామకృష్ణ విద్యానిలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన ఆస్తులను వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. దేవాలయాల్లో పూజలు, ప్రసాద కైంకర్య సేవలన్నీ అత్యంత భక్తిశ్రద్ధలతో, నాణ్యతతో నిర్వహించేలా చూడాలని, ఉల్లంఘనలకు పాల్పడితే దోషులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. హైందవ పరిరక్షణకై నిర్వహిస్తున్న శంఖారావం మహాసభలకు హిందువులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు జి.కుటుంబారావు, మాణిక్యారావు, రమామాతాజీ పాల్గొన్నారు.

టీ తాగేందుకు వచ్చి వ్యక్తి మృతి



చెరుకుపల్లి: టీ తాగేందుకు వచ్చి గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం చుండూరు మండలం దిండిపాలెం గ్రామానికి చెందిన లంకా బిక్షాలురెడ్డి (47) పొన్నపల్లిలో దినం కార్యక్రమానికి వచ్చి టీ తాగి వస్తానని చెప్పి చెరుకుపల్లిలోని టీ సెంటర్‌కు వెళ్లి అక్కడే గుండె పోటుతో కుప్పకూలి మృతి చెందాడు. మృతుడికి గతంలోనే రెండు స్టెంట్లు కూడా వేశారని బంధువులు తెలిపారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం..

పట్టని యంత్రాంగం

కంపు కొడుతున్న పూండ్ల

- గృహాల ముందే నిలిచి ఉంటున్న మురుగు నీరు
- దుర్వాసన, దోమల ఉధృతితో గ్రామస్తుల ఇక్కట్లు
- బోదకాలు, జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- నిత్యం గృహాల మధ్యలో సంచరిస్తున్న విషసర్పాలు
- ఇప్పటికే గ్రామంలో పాము కాటుకు ఒకరు మృతి



గ్రామంలో గృహాల ముందు నిలిచిన మురుగు నీరు

బాపట్లటౌన్: గ్రామాల్లోని వీధులన్నీ సుందరంగా తీర్చిదిద్దుతాం.. గ్రామీణ ప్రాంతాలను సస్యశ్యామలంగా మార్చడమే మా లక్ష్యం అనే ప్రభుత్వ నిబంధనలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రూ.కోట్ల నిధులు వెచ్చించామని చెబుతున్నారే కానీ, క్షేత్రస్థాయిలో అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ గ్రామాల్లో మాత్రం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మండలంలోని పూండ్ల గ్రామంలో మురుగు నీరు రోడ్లపై పారుతూనే ఉంది. రోజుల తరబడి మురుగు నీరు గృహాల ముందు నిలబడి ఉండటంతో దోమల ఉధృతి రోజురోజుకు పెరిగిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం కచ్చా డ్రైన్లు కూడా తవ్వకపోవడంతో గృహాల ముందే మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంటుంది.

సమస్యలు కేరాఫ్ పూండ్ల

మండలంలోని పూండ్ల గ్రామ పంచాయతీలో అడుగుపెడితే సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. రోజుల తరబడి మురుగు నీరు గృహాల ముందే నిలిచి ఉండటం అలాగే నిత్యం గృహాల మధ్యలో సంచరిస్తున్న విషసర్పాలతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికే పాము కాటుకు గురై గాలి సుందరరావు మృతి చెందటంతో గ్రామస్తులు మరింత ఆందోళన చెందుతున్నారు. 2 వేల పై చిలుకు ఓట్లు పూండ్ల గ్రామ పంచాయతీలో 4 వేలకు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. గ్రామంలోని మురుగు నీటిని బయటకు పంపించే కార్యక్రమాన్ని చేపట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నా అటు పాలకులు, ఇటు అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం గృహాల ముందు నిలిచిన మురుగు నీటిని కూడా బయటకు తరలించే ప్రయత్నం చేయటం లేదు.

సమస్యలు పరిష్కరించండి

పూండ్ల గ్రామంలో దోమల ఉధృతి పెరిగి ప్రజలు బోదకాలు, విషజ్వరాలైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నా పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయి అధికారులెవరూ ఆ గ్రామం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు అనేక పర్యాయాలు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. కనీసం గ్రామంలోని వీధుల్లో బ్లీచింగ్, సున్నాలు చల్లించే నాథుడు కూడా లేరంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో వచ్చిన నాయకులు మీ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ఎన్నికలైన తర్వాత నాయకుల సంగతి దేవుడెరుగు.. కనీసం పంచాయతీ అధికారులు, కార్యదర్శులు కూడా మా గృహాల వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

బ్లీచింగ్ చల్లే వారు లేరు



మేము నిత్యం మురుగు నీటితోనే సహజీవనం చేస్తూ జీవించాల్సి వస్తుంది. ఇంటి చుట్టూ మురుగు నీరు నిలిచి నిత్యం దుర్వాసన వెదజల్లుతుంది. కనీసం మా వీధుల్లో సున్నాలు, బ్లీచింగ్ చల్లిన వారు కూడా లేరు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా ప్రయోజనం ఉండటం లేదు.

– చింతపల్లి సంతోషం, పూండ్ల

భయంతో బతకాల్సి వస్తుంది



గృహాల ముందు మురుగు నీరు రోజుల తరబడి నిలిచి ఉండటం వలన ఏ క్షణాన ఏం జరుగుతుందోనని క్షణ క్షణం భయంతో బ్రతకాల్సి వస్తుంది. దోమల ఉధృతి వలన గ్రామంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీధుల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదు.

– రుద్రపాటి ధనమ్మ, పూండ్ల

దోమల వలనే బోదకాలు



నాకు దోమలు కుట్టడం వలన బోదకాలు వ్యాధి వచ్చింది. దీంతో నేను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. నాలాంటి పరిస్థితి ఈ గ్రామంలోని ఏ ఒక్కరికి రాకూడదని అధికారులకు అనేక పర్యాయాలు విన్నవించుకున్నా ప్రయోజనం ఉండటం లేదు. కనీసం వీధుల్లోని మురుగు నీటిని బయటకు పంపేందుకు డ్రైనేజీలు కూడా సక్రమంగా తవ్వుతున్న దాఖలాలు లేవు. అధికారులు పట్టించుకోవాలి.

– మిక్కిలి నాగమణి, పూండ్ల

సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం



పూండ్ల గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉన్న విషయం మా దృష్టికి రాలేదు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామంలో పారిశుద్ధ్య పనులను తక్షణమే మెరుగుపరుస్తాం.

– బి.బాబురావు, ఎంపీడీవో

రామలింగేశ్వరస్వామికి పూజలు



చుండూరు(వేమూరు): రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక పూజలు నిర్వహించారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసం ముగింపు సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి తెల్లవారుజామున అభిషేకాలు జరిగాయి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పోతురాజుస్వామికి పూజలు



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): కార్తిక మాసం సందర్భంగా పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని పోతురాజుస్వామి శిల వద్ద ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి పాల్గొన్నారు. తొలుత ఆయన పార్టీ నాయకులతో కలసి పోతురాజుస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులు పోతురాజుస్వామి సన్నిధిలో శివలింగం ఆకారంలో ముగ్గులు వేసి పసుపు, కుంకుమలతో అలంకరించి కార్తిక దీపాలు వెలిగించారు. మహా కర్పూర జ్యోతి వెలిగించి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో వీర రాఘవరెడ్డి, విజయ్, శ్రీనివాస్, రవిరెడ్డి, చిన వీరరాఘవులు ఉన్నారు.

కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

చెరుకుపల్లి: మండలంలో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెడతామని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, ముందుగా పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, వసతులు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఎస్సై అనీల్‌కుమార్‌ను ఆదేశించారు. రౌడీ షీటర్లు కూడా నేర ప్రవృత్తి విడనాడి సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు. గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల రక్షణ కోసం పోలీస్ వ్యవస్థ నిరంతరం పని చేస్తుందని రాత్రి వేళల్లో గస్తీ మరింత పెంచుతామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె రూరల్ సీఐ సురేష్‌బాబు, స్థానిక ఎస్సై అనీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ఆందోళనలో రైతులు



వెల్లటూరులో నేలవాలిన వరి పంట

రైతు(భట్టిప్రోలు) భట్టిప్రోలు: రైతులను అకాల వర్షాలు, తుపాన్లు, వాయుగుండాలు వెన్నాడుతున్నాయి. శుక్రవారం నుంచి వరుసగా వర్షాలు కురియడంతో వరి ఓదెలు నీటిలోనే మగ్గుతున్నాయి. పంట చేలల్లో నీరు బయటకు పంపేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వరి కంకుల్లో ధాన్యం రంగు మారుతుంది. నీట మునిగిన వరి ఓదెలు, నేల వాలిన పంటను పైకి లేపి కట్టడానికి కూలీలకు ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు ఖర్చు అవుతుంది. దీంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. వర్షం ధాటికి పంట దిగుబడులు నీటిలో నానుతున్నాయి.

సబ్సిడీపై విత్తనాలు అందజేయాలి



నేను ఎకరా సొంతం, రెండెకరాలు కౌలు సాగు చేశాను. ఈ వర్షాలకు పంట నీట మునిగింది. రెండవ పైరుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికి అదను తప్పుతుందనే భయం పట్టుకుంది. ఇప్పటికే ఎకరాకు కౌలు రూ.30 వేలు, ఖర్చుల కింద రూ.25 వేలు ఖర్చు చేశాను. ఇవన్నీ వచ్చే వాటికి సరిపోతాయి. సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాలు అందచేయాలి.

–ఆదిన శ్రీనివాసరావు, రైతు, భట్టిప్రోలు

సర్వపాపాలను రూపు మాపే యజ్ఞం జ్వోలా తోరణం

తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామి



ఐశ్వర్య జ్వాలా తోరణానికి నమస్కారం చేస్తున్న పీఠాధిపతి శివస్వామి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ



జ్వాలా తోరణం కార్యక్రమంలో భక్తులు

బాపట్లటౌన్: సర్వ పాపాలను రూపు మాపే ఒక మహోన్నతమైన యజ్ఞమే కార్తిక ఐశ్వర్య జ్వాలా తోరణమని తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామి అన్నారు. పట్టణంలోని రథం బజార్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, వాసవి సేవా సమితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఐశ్వర్య జ్వాలా తోరణం కార్యక్రమంలో పాల్గొని ఉపదేశం చేశారు. తొలుత దీపాలు వెలిగించి జ్వాలా తోరణాన్ని ప్రారంభించారు. కార్తిక మాసంలో చేసే పూజలకు ఎంతో ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఉందన్నారు. శివ నామస్మరణతో ఈ నెల రోజులు శివ ధ్యానం చేసిన ప్రతి ఒక్కరికి ఆ పరమేశ్వరుడి కటాక్ష వీక్షణాలు నిండుగా ఉంటాయన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ మాసంలో వచ్చిన చివరి ఆదివారం అమావాస్య అతి పవిత్రమైందన్నారు. బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలన్నారు. ప్రభుత్వాలు, పాలకులు సంపూర్ణమైన పరిపాలన అందించే విధంగా ఆ పరమేశ్వరుడు ఆశీస్సులు అందించాలన్నారు. బాపట్ల అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ దంపతులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు వెలంపల్లి సత్యనారాయణ, సంపత్ గణపతి పరివార్ కన్వీనర్ బాబు నాగేంద్ర పాల్గొన్నారు.

మంచి జీవనశైలిని కలిగి ఉండండి

తెనాలిఅర్బన్: మంచి జీవనశైలిని కలిగి ఉండటం వల్ల వ్యాధులు దరిచేరవని హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హస్పటల్ నిర్వాహకులు డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. హ్యాపీ హస్పటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ మహేష్ కిరణ్, డాక్టర్ ఈదర సుప్రియ చౌదరి, డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ మంజులవాణిలు రోగులకు వైద్య సేవలు అందించారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. ఉదయ్, భాస్కర్, రమణమ్మ, సతీష్, పూజిత, సంధ్య, అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన కార్తిక శోభ



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాలాత్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి వారి ఆలయంలో కార్తిక మాసం ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేసినట్లు అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ తెలిపారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కొలువైన గ్రామ దేవతలు ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవస్థానాల్లో కార్తిక మాసం సందర్భంగా మొత్తం 30 ఏకాదశ రుద్రాభిషేకాలు, 29 మాస లీలా కల్యాణోత్సవాలు జరిగాయి. సూరేపల్లిలో కొలువైన కేదారేశ్వర వాయులింగ దేవస్థానంలో స్వామి వారికి భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించేలా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు చేశారు. భట్టిప్రోలులోని అతి పురాతనమైన 14వ శతాబ్దం నాటి శివ లింగమైన మల్లేశ్వరునికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి పూజలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రేపల్లె రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పెనుమూడి గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు పెనుమూడి గ్రామంలో రైతు సేవ కేంద్రం సమీపంలో వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడన్న సమాచారంతో ఘటన స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, ఆకుపచ్చ టీషర్ట్ ధరించి, కుడి చేతికి కడియం కలిగి ఉన్నాడన్నారు. శవపంచనామా నిర్వహించి రేపల్లె ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని బంధువులు ఎవరైనా ఉంటే మృతదేహాన్ని తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

మధుమేహ వ్యాధిగ్రస్తులు తప్పక వ్యాయామం చేయాలి

కర్లపాలెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని ప్రముఖ మధుమేహ వైద్యులు చల్లా రామోహన్‌రావు అన్నారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ చల్లా రామోహన్‌రావు మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటించాలని చెప్పారు. రక్తపోటు వ్యాధిగ్రస్తులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత జీవనం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు టి.వి.సుబ్బారావు, వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, సమితి సభ్యులు పి.బాపిరాజు, ఆరె వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు, బి.బుల్లియ్య, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె రూరల్: రైతులను నట్టేట ముంచే ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వం అనటంలో ఏ మాత్రం సందేహం లేదని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికే రైతులకు రైతు భరోసా పథకంతో పెట్టుబడి సాయం అందించి ఆదుకునేదని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే రైతులకు సలహాలు, సూచనలు అందించటంతో పాటు పండిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయటం జరిగిందన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఎన్నికల ముందు కల్లబొల్లి హామీలిచ్చారన్నారు. ఖరీఫ్‌కు ముందుగానే పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందిస్తామని హామీలిచ్చి, గెలిచాక ఊసే మరిచారన్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా పెట్టుబడి సాయంపై కూటమి నేతలు పెదవి విప్పటం లేదన్నారు. దీంతో రైతులు, కౌలురైతులు అప్పులతో ఖరీఫ్ సాగు నెట్టుకొచ్చారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారన్నారు. ఖరీఫ్ ఆరంభంలో సంభవించిన తుపానులతో రెండు సార్లు నాట్లు వేసిన్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం చివరి దశలో వచ్చిన తుపాను రైతులను నట్టేట ముంచిందన్నారు. విశాఖపట్నం వాతావరణ కేంద్రం వారం రోజుల ముందుగానే తుపాను హెచ్చరికలు జారీ చేసిన రైతులను అప్రమత్తం చేయటంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు ప్రభుత్వం చేసిన ప్రకటనలు ఆచరణలో అమలు కావటం లేదన్నారు. తేమ సాకుతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు తిరస్కరిస్తుండటంతో రైతులు దగా పడుతున్నారన్నారు. చేసేదిలేక తక్కువ ధరలకే దళారులను ఆశ్రయిస్తూ మిల్లర్లకు అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తుపాను ప్రభావంతో తడిచిన ధాన్యాన్ని షరతులు లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి, మైలవరం గ్రామాల్లో నూతన కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు నెలల కాలంలో రూ.15,485.36 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ఆరోపించారు. భట్టిప్రోలు పట్టణ అధ్యక్షుడిగా కె.రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐలవరం గ్రామ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎం.తులసిరంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, మరో నలుగురు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, మండల కన్వీనర్ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, వాసు, మాచర్ల సుందరరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా గీతా జయంతి



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలోని గీతా జ్ఞాన ఆశ్రమంలో ఆదివారం కార్తిక బహుళ అమావాస్య సందర్భంగా గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ పరమాత్ముడు అర్జునుడికి గీతను ప్రబోధించిన పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా గీతా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వేములపల్లి వనజాక్షమ్మ తెలిపారు. కర్పూర యజ్ఞాన్ని ఆశ్రమ ఆస్థాన పండితులు, యునెస్కో పండితులు బ్రహ్మశ్రీ వంగర చలమయ్య సిద్ధాంతి, వంగర నాగేశ్వరరావులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకృష్ణ పరమాత్మునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని నిర్వాహకురాలు పర్యవేక్షించారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు.